సాక్షి
అనంతపురం
బుధవారం ׀ 11 ׀ జూన్ ׀ 2025



చీనీ టన్ను రూ.33 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.33 వేలు పలికాయి.



మరో కరోనా కేసు నమోదు

జిల్లాలో మరో కరోనా కేసు నమోదైంది. ప్రొద్దుటూరుకు చెందిన ఓ 75 ఏళ్ల వృద్ధుడికి కోవిడ్ నిర్ధారణ అయ్యింది.

గరిష్ఠం/కనిష్ఠం
37.7°/22.6°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు, రేపు భారీ వర్షాలు

• కలెక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం అర్బన్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో బుధ, గురువారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ హెచ్చరించిందని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

'రెవెన్యూ'లో బదిలీ ప్రక్రియ పూర్తి

అనంతపురం అర్బన్: రెవెన్యూ శాఖలో బదిలీల ప్రక్రియ పూర్తయింది. ఇందుకు సంబంధించి ఉత్తర్వులను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ జారీ చేశారు. 32 మంది డిప్యూటీ కలెక్టర్లు, 11 మంది రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లు, 38 మంది మండల రెవెన్యూ, సీనియర్ అసిస్టెంట్లు, ఏడుగురు జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులకు స్థాన చలనం కల్పించారు.

ఇద్దరు తహసీల్దార్ల బదిలీ

ఇద్దరు తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ వి.వినోద్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టరేట్ కో–ఆర్డినేషన్ విభాగం సూపరింటెండెంట్‌గా నియమితులైన తహసీల్దారు పి.శేషారెడ్డిని బుక్కరాయసముద్రం మండల తహసీల్దారుగా బదిలీ చేశారు. అక్కడున్న జి.పుణ్యవతిని పుట్లూరుకు పంపారు.

బాలికకు అండగా ఉంటాం

• మాజీ మంత్రి సాకే శైలజానాథ్



ఆస్పత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న శైలజానాథ్

అనంతపురం మెడికల్: మృగాళ్ల చేతిలో పాశవికంగా గాయపడ్డ రామగిరి మండలానికి చెందిన బాలికకు అండగా ఉంటామని, న్యాయం చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని లేబర్ వార్డులో అడ్మిషన్‌లో ఉన్న బాలికను పరామర్శించేందుకు మాజీ మంత్రి వెళ్లగా.. పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల సూచనలను గౌరవించిన మాజీ మంత్రి తన ప్రయత్నాన్ని విరమించుకున్నారు. బాలిక ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని గైనిక్ వైద్యులకు సూచించారు. బాలికను కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదని వాపోయారు. మాజీ మంత్రి వెంట యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, ఎంపీటీసీ సురేష్, నాయకులు శివశంకర్ నాయక్ ఉన్నారు.

సీఐ రాజేంద్రనాథ్ యాదవ్‌పై సస్పెన్షన్ వేటు



అనంతపురం: అనంతపురం వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్‌పై సస్పెన్షన్ వేటు పడింది. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన గిరిజన విద్యార్థిని తన్మయి హత్య కేసులో నిర్లక్ష్యం వహించినట్లు తేలడంతో ఆయనపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. తన్మయి ఈ నెల 3న అదృశ్యమైంది. 4వ తేదీ వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో బాధిత తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో వారు అనుమానితుల పేర్లు చెప్పినప్పటికీ పోలీసులు అలసత్వం వహించారు. ఘోరాన్ని అరికట్టలేకపోయారు. తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినప్పుడు సత్వరమే స్పందించి ఉంటే దారుణ ఘటన చోటు చేసుకుని ఉండేది కాదని వైఎస్సార్‌సీపీ, గిరిజన సంఘాలు పెద్ద ఎత్తున ఉద్యమించాయి. ఈ క్రమంలో సీఐ రాజేంద్రనాథ్ యాదవ్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ఎస్పీ జగదీష్ వెల్లడించారు.

కీచక పర్వంపై ఆగ్రహ జ్వాల

- కూటమి సర్కారులో తారస్థాయికి మహిళలపై దురాగతాలు
- మండిపడిన మహిళా లోకం
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అంబేడ్కర్ విగ్రహాల వద్ద వైఎస్సార్ సీపీ నిరసనలు
- హోంమంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్



అనంతపురంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాళ్లు, మహిళలు

అనంతపురం కార్పొరేషన్: రాష్ట్రంలో దళితులు, గిరిజనులు, మహిళలకు రక్షణ కరువైంది. చంద్రబాబు సర్కారు పుణ్యమా అని మద్యం విచ్చలవిడిగా లభ్యమవుతుండడంతో చిన్నారులకూ భద్రత లేకుండా పోతోంది. ఇంత జరుగుతున్నా తగిన చర్యలు తీసుకోవడంలో చేష్టలుడిగి చూస్తున్న కూటమి సర్కారుపై మహిళలు కదం తొక్కారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మంగళవారం నిరసన ప్రదర్శనలు చేపట్టారు.

రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా..?

కూటమి ప్రభుత్వంలో మహిళలపై దురాగతాలు తారస్థాయికి చేరాయని వైఎస్సార్ సీపీ నాయకురాళ్లు ధ్వజమెత్తారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులకు నిరసనగా పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. అనంతరం అక్కడే బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, గుంతకల్లు మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతి రెడ్డి, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, వైఎస్సార్ మహిళా విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణవేణి, జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవి, నాయకురాళ్లు బోయ సుశీలమ్మ, పేరం స్వర్ణలత తదితరులు పాల్గొని ప్రసంగించారు. గిరిజన విద్యార్థిని హత్య ఘటన యావత్ ప్రజానీకాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా అనే అనుమానం కలుగుతోందన్నారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో 188 మంది మహిళలపై దాడులు జరిగాయన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగంపై ఉన్న దృష్టి ప్రజా శ్రేయస్సుపై లేదన్నారు. ఇన్ని దారుణాలు జరుగుతున్నా చంద్రబాబు ప్రభుత్వానికి పట్టదా అని ప్రశ్నించారు. కనీసం బాధితులను పరామర్శించిన పాపాన పోలేదన్నారు. మహిళలు, యువతులపై దాడులు జరుగుతున్నా హోం మంత్రి ప్రేక్షపాత్ర పోషిస్తున్నారని, తక్షణం ఆమె తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తెలంగాణలో 'దిశ' ఘటన జరిగితే... ఆ దుస్థితి ఏపీలో అక్కచెల్లెమ్మలకు రాకూడదని 'దిశ' యాప్, పోలీసు స్టేషన్‌లను తీసుకువచ్చారన్నారు. మహిళలపై అఘాయిత్యాలు జరిగిన వెంటనే క్షణాల్లో పోలీసులు స్పందించేలా చర్యలు తీసుకున్నారన్నారు. కానీ ఇప్పుడలాంటి పరిస్థితి లేదన్నారు. బాధితులు స్టేషన్‌కు వెళ్లి మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. రామగిరి మండలంలోని గ్రామంలో బాలిక పట్ల పాశవికంగా అత్యాచారం జరిగితే కేసును పోలీసులు తీవ్ర జాప్యం చేస్తున్నారన్నారు. అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో దీనస్థితిలో ఉన్న బాలికను ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని రానున్న రోజుల్లో తప్పక బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రాజేశ్వరి, ముంతాజ్, చంద్రలేఖ, దుర్గాదేవి, లక్ష్మి దేవి, పార్టీ మహిళా విభాగం నాయకురాళ్లు భూమిరెడ్డి జాహ్నవి, శోభాబాయి, శోభారాణి, ఉషా, భారతి, హజరాబి, దేవి, హరిత, పార్వతి, సుజాత రెడ్డి, బిందుప్రియ తదితరులు పాల్గొన్నారు.



దాడులు అరికట్టాలని, పోలీసులు నిర్లక్ష్య వైఖరి వీడాలని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మహిళలు



కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న మహిళలు

అంబేడ్కర్ చిత్రపటానికి వినతిపత్రం

కూటమి ప్రభుత్వంలో మహిళలు, బాలికలకు రక్షణ లేకుండా పోయిందని వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేశాయి. గిరిజన విద్యార్థి తన్మయి దారుణ హత్య, రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో దళిత మైనర్ బాలికపై అత్యాచారం విషయంలో కూటమి ప్రభుత్వ అలసత్వాన్ని ఖండిస్తూ రాప్తాడులో నిరసన ప్రదర్శన చేపట్టారు. అంబేడ్కర్ చిత్రపటానికి వినతిపత్రం సమర్పించారు.

పాపం చంద్రబాబుదే..

మహిళలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాల పాపం ముమ్మాటికీ సీఎం చంద్రబాబుదేనని వైఎస్సార్ సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక మండిపడ్డారు. మహిళలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులను నిరసిస్తూ మంగళవారం హిందూపురంలో టీఎన్ దీపిక ఆధ్వర్యంలో 'సేవ్ ఆంధ్ర ఉమెన్' పేరిట మహిళలు నిరసన తెలిపారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు.

తుంగభద్ర డ్యాం కళకళ



తుంగభద్ర జలాశయం

సాక్షి, బళ్లారి: తుంగభద్ర డ్యాం కళకళలాడుతోంది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు తాగు, సాగు నీరందించే ఈ జలాశయంలో రోజు రోజుకూ నీటిమట్టం పెరుగుతోంది. ఎగువన పశ్చిమ కనుమలు, శివమొగ్గ జిల్లాలో జోరుగా వర్షాలు కురవడంతో డ్యాంకు నీటి ప్రవాహం పెరిగింది. జలాశయం సామర్థ్యం వంద టీఎంసీలు కాగా, ప్రస్తుతం నీటి మట్టం 25 టీఎంసీలకు చేరినట్లు డ్యాం అధికారులు తెలిపారు. రాబోయే వారం రోజుల్లో మరో 15 టీఎంసీలు నీరు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

దాడులకు దిగిన వారిపై చర్యలు తీసుకోండి

• ఎస్పీకి జర్నలిస్టుల ఫిర్యాదు



ఎస్పీ జగదీష్‌కు ఫిర్యాదు అందిస్తున్న జర్నలిస్టులు

అనంతపురం: 'సాక్షి' చానల్ డిబేట్‌లో జరిగిన సంఘటనను సాకుగా తీసుకుని 'సాక్షి' కార్యాలయాలపై దాడులకు దిగిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సాక్షి బ్యూరో ఇన్‌చార్జ్ గుండం రామచంద్రా రెడ్డి, బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్, సాక్షి టీవీ కరస్పాండెంట్ శివా రెడ్డి కోరారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ పి. జగదీష్‌కు మంగళవారం ఫిర్యాదు అందజేశారు. డిబేట్‌లో జర్నలిస్ట్ కృష్ణం రాజు తన వ్యక్తిగత అభిప్రాయాన్ని వెల్లడించగా.. దాన్ని సాక్షి చానల్‌కు ఆపాదించడమే కాక 'సాక్షి' కార్యాలయంపై దాడికి దిగడం దారుణమన్నారు. ఈ ఘటన వెనుక రాజకీయ ప్రమేయం ఉందన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారించి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.ఉద్దేశపూర్వకంగానే జన సమీకరణ చేసి పత్రికా కార్యాలయాలపై దాడి చేయడం పత్రికా స్వేచ్ఛకు విఘాతం కల్పించడమేనని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖలో బదిలీలలు

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయ, అనుబంధ శాఖల్లో బదిలీల పర్వం ఇష్టారాజ్యంగా జరిగినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ధనవంతులు, బలవంతులు తాము కోరుకున్న చోట పోస్టింగ్ సాధించినట్లు తెలిసింది. వ్యవసాయ, ఉద్యాన, పట్టు, పాడి, మత్స్య, మార్కెటింగ్ శాఖల్లో పెద్ద ఎత్తున ఉద్యోగుల బదిలీలు జరిగాయి. సోమవారం రాత్రి 10 గంటల నుంచి మంగళవారం తెల్లవారు జాము వరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే 'అనుకున్నది ఒకటి...అయ్యింది మరోటి' అన్నట్లుగా చాలా మంది ఉద్యోగులు బదిలీలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలు గాలికి వదిలేశారని విమర్శిస్తున్నారు. ప్రజాప్రతినిధుల పలుకుబడి, సిఫారసులు, పెద్ద మొత్తంలో డబ్బు చేతులు మారినట్లు ప్రచారం జరుగుతోంది.

ఆ పోస్టులకు రూ.లక్షల్లోనే బేరం..

వ్యవసాయ శాఖలో ఉమ్మడి జిల్లా పరిధిలో ఒక డిప్యూటీ డైరెక్టర్ శివప్రసాద్ బదిలీ అయ్యారు. 9 మంది అసిస్టెంట్ డైరెక్టర్లు (ఏడీఏ), దాదాపు 57 మంది అగ్రికల్చర్ ఆఫీసర్స్ (ఏఓ)కు బదిలీ ఉత్తర్వులు అందాయి. అయితే ఇందులో అనంత పురం ఏడీఏ, రూరల్ ఏఓతో పాటు మరో నాలుగు స్థానాలకు పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారినట్లు ఆ శాఖలో ప్రచారం సాగుతోంది. ఏడీఏ పోస్టుకు రూ.20 లక్షలు, ఏఓ పోస్టుకు రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షలు, మరో ఐదారు పోస్టులకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు బేరసారాలు జరిగాయనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇందులో అధికార పార్టీ ప్రజాప్రతినిధులతో పాటు అసోసియేషన్ రాష్ట్ర స్థాయి నేతలు, కొందరు అగ్రీ ఇన్‌పుట్ డీలర్లు చక్రం తిప్పినట్లు తెలుస్తోంది. అధికారులు ఇచ్చిన ఆప్షన్లు, ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలతో సంబంధం లేకుండా అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్ అంటూ అడ్డదిడ్డంగా బదిలీలు చేసినట్లు చెబుతున్నారు. బదిలీ జాబితాలో లేని వారు, ఆప్షన్ ఇవ్వని వారిని కూడా బదిలీ చేయడం విశేషం. కాగా వ్యవసాయశాఖ ఏఓ బదిలీ జాబితాలు ఆపేయాలని మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు వచ్చినట్లు చెబుతున్నారు.

అంతా గందరగోళం..

పశుసంవర్ధకశాఖలో బదిలీ ఉత్తర్వులు వెలువరించి.. ఆ తర్వాత తక్షణమే వెనక్కి తీసుకోవడంతో గందరగోళం నెలకొంది. జాబితాలు వెల్లడించొద్దని డైరెక్టరేట్ నుంచి ఆదేశాలు వచ్చినట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి. అలాగే మత్స్యశాఖ పరిధిలో రెండు ఎఫ్‌డీఓ పోస్టుల విషయం కూడా తేల్చలేదు. పట్టు పరిశ్రమ శాఖ రెండు జిల్లాల అధికారులకు బదిలీ ఉత్తర్వులు అందాయి. అనంతపురంలో పనిచేస్తున్న డి.ఆంజనేయులు కర్నూలుకు, కర్నూలులో పనిచేస్తున్న విజయకుమార్ అనంతపురానికి బదిలీ అయ్యారు. అలాగే శ్రీ సత్యసాయి జిల్లా జేడీ పద్మమ్మ చిత్తూరుకు, అక్కడ పనిచేస్తున్న శోభారాణి శ్రీ సత్యసాయి జిల్లాకు బదిలీ అయ్యారు. పట్టు పరిశ్రమల శాఖలో కొందరు సెరికల్చర్ అధికారుల (ఎస్‌ఓ) బదిలీలు ఇష్టారాజ్యంగా జరిగాయని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో చాలా మంది అధికారులు మంగళవారమే ఇక్కడి నుంచి రిలీవ్ అయ్యారు.

మొండిగా ముందుకు..

- ఫిర్యాదులను పట్టించుకోకుండా ఎస్జీటీల బదిలీల కౌన్సెలింగ్‌కు సిద్ధమైన విద్యాశాఖ
- అడ్డుకున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు





రాత్రి 10 గంటల సమయంలో పడిగాపులు కాస్తున్న మహిళా టీచర్లు, కౌన్సెలింగ్ కేంద్రంలో ఎదురుచూపులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల్లో అత్యధికులైన సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీల్లో విద్యాశాఖ అధికారులు సీనియార్టీ జాబితాలో అసంబద్ధాలు తొలగించకుండానే మొండిగా ముందుకు వెళ్లాలని చూశారు. అయితే, ఫిర్యాదులను పట్టించుకోకుండా కౌన్సెలింగ్‌కు సిద్ధమవడంతో ఉపాధ్యాయ సంఘాల నాయకులు అడ్డుకోవడంతో గందరగోళం నెలకొంది. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక పంగల్‌రోడ్డులోని ఆర్డీటీ స్కూల్‌లో సీరియల్ నంబరు 1 నుంచి 350 వరకు ఉన్న టీచర్లకు బదిలీలు చేపడతామని విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రకటించారు. దీంతో ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి ఉరుకులు, పరుగులతో ఎస్జీటీలు కౌన్సెలింగ్ కేంద్రానికి చేరుకున్నారు.

తీవ్ర ఇబ్బందులు..

కౌన్సెలింగ్ కేంద్రంలో తాగేందుకు కూడా నీటి వసతి కల్పించకపోవడంతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో సాంకేతిక కారణాలు అంటూ, ఉన్నతాధికారుల నుంచి లింక్ రాలేదంటూ రాత్రి 9 గంటల దాకా గడిపారు. ఎట్టకేలకు 9.30 గంటల సమయంలో కౌన్సెలింగ్ ప్రారంభిస్తున్నట్లు డీఈఓ ప్రసాద్‌బాబు మైకుద్వారా ప్రకటించారు. ముందుగా జాబితాలోని 1 నుంచి 30 మంది టీచర్లు రావాలని పిలవగా.. ఉపాధ్యాయ సంఘాల నాయకులు అడ్డుకున్నారు. అనేక ఫిర్యాదులు ఇచ్చినా అవేవీ పట్టించుకోకుండా సీనియార్టీ జాబితాలో మార్పు చేయకుండా ఎలా కౌన్సెలింగ్ నిర్వహిస్తారంటూ నిలదీశారు. ఒక టీచరుకు 32 పాయింట్లు రావాల్సి ఉండగా 27 పాయింట్లు వచ్చాయని, రెండు సార్లు రీఅపోర్స్‌మెంట్‌కు గురైన మరో టీచరుకు రావాల్సిన 7 ప్రత్యేక పాయింట్లు వేయలేదని, తాత్కాలిక సీనియార్టీ జాబితాలో ఉన్న స్పౌజ్ పాయింట్లు ఫైనల్ జాబితాలో కనిపించడం లేదని.. ఇలా పదుల సంఖ్యల్లో సమస్యలు ఉన్నాయన్నారు. దీంతో సీనియార్టీలో వందలు, వేలల్లో తేడా వస్తోందంటూ వాపోయారు. ఇవేవీ పరిష్కరించకుండా వారిని అన్యాయం చేస్తారా అని నిలదీశారు. కమిషనర్ నుంచి అనుమతులు తీసుకుని వాటన్నింటినీ పరిష్కరించిన తర్వాతనే కౌన్సెలింగ్ జరపాలంటూ పట్టుబట్టారు. ఇంతలో విద్యాశాఖ అధికారులు పోలీసులకు సమాచారం అందించగా.. రాప్తాడు పోలీసులు చేరుకున్నారు. అయినా నాయకులు వెనక్కి తగ్గలేదు. నిబంధనల మేరకు రావాల్సిన పాయింట్లు వేసే వరకు జరపకూడదంటూ తెగేసి చెప్పారు. దీంతో డీఈఓ పలుమార్లు ఆర్జేడీ, రాష్ట్ర అధికారులతో ఫోన్‌లో మాట్లాడాల్సి వచ్చింది.

150 మందికి మాత్రమే కౌన్సెలింగ్

తొలి 150 మందికి సంబంధించిన సీనియార్టీలో ఎలాంటి సమస్యలు లేకపోవడంతో చివరకు ఆ 150 మందికి మాత్రమే జరుపుతామన్నా సంఘాల నాయకులు ఒప్పుకోలేదు. చివరకు పలువురి జోక్యంతో వారికి కౌన్సెలింగ్ చేసేందుకు ఒప్పుకున్నారు. ఇదే విషయాన్ని డీఈఓ ప్రకటించారు. అయితే వారికి కూడా బుధవారం ఉదయం ఫైనల్ సీనియార్టీ జాబితాలో మార్పులు చేసి ప్రకటిస్తామని వెల్లడిస్తామన్నారు. దీంతో మధ్యాహ్నం నుంచి పడిగాపులు కాసిన వారు ఉసూరుమంటూ వెనుతిరిగారు.

తూకంలో బురిడీ

- స్టోర్లలో బియ్యం నొక్కేస్తున్న కొందరు డీలర్లు
- రెండు కిలోల నుంచి ఐదు కిలోల మేర కోత
- అధికారుల పర్యవేక్షణ కరువు

అనంతపురం అర్బన్: ప్రజా సంక్షేమానికి పాతర వేస్తూ, డీలర్ల స్వప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ బియ్యం, సరుకులు నొక్కుడుకు కూటమి ప్రభుత్వం రాచబాట వేసిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. బియ్యం తూకం తక్కువగా ఇస్తున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. జిల్లాలో 1,645 చౌక ధరల దుకాణాలు ఉన్నాయి. గతంలో వీటి పరిధిలో 405 ఎండీయూ వాహనాలు ఇంటింటికీ రేషన్ పంపిణీ చేస్తూ వచ్చాయి. రేషన్ కార్డులకు బియ్యం, ఇతర సరుకుల కోటాను డీలర్ల నుంచి ఎండీయూ నిర్వాహకులు తీసుకుని ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేసేవారు. ఈ విధానంలో డీలర్ కోటా మేరకు ఎండీయూకి బియ్యం కచ్చితమైన తూకం ఇచ్చేవారు. దీంతో డీలర్లకు బియ్యం, కంది పప్పు, చక్కెర మిగుల్చుకునే అవకాశం ఉండేది కాదు. కూటమి ప్రభుత్వం ఆ విధానానికి స్వస్తి పలికి స్టోర్ ద్వారా పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవడంతో ప్రస్తుతం డీలర్లు కార్డుదారులను తూకాల్లో బురిడీ కొట్టిస్తున్నారు. రెండు నుంచి 5 కిలోలు వరకూ బియ్యం తక్కువగా, మిగతా సరుకులు ఇవ్వకుండా మిగుల్చుకుంటున్నారు. అధికారులు స్టోర్లను తనిఖీ చేస్తారే తప్ప స్టోర్ నుంచి లబ్ధిదారులు తెచ్చే బియ్యం తూకం గురించి పట్టించుకోవడం లేదు. వాటిని తూకం వేస్తే డీలరు ఎన్ని కిలోలకు ఎన్ని కిలోలు తక్కువగా ఇస్తున్నారనేది బయపడుతుందని పలువురు చెబుతున్నారు.



అనంతపురం హౌసింగ్ బోర్డులో ఒక చౌక దుకాణం నుంచి రేషన్ బియ్యాన్ని ఆటోలో తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

బ్లాక్‌మార్కెట్‌కు..

తూకం తేడాతో మిగుల్చుకున్న సరుకులను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. అనుమానం రాకుండా బియ్యాన్ని కొత్త సంచుల్లో ఉంచి తరలిస్తున్నారు. ఈ బియ్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రత్యేకంగా కొందరు వ్యక్తులు ఉంటున్నారు. కిలో రూ.10 నుంచి రూ.12తో కొనుగోలు చేసి కర్ణాటక, ఇతర ప్రాంతాలకు అక్రమంగా రవాణా చేస్తున్నారు.

- ఈనెల 3వ తేదీన గుత్తి పట్టణంలో ప్రధాన బజారులోని 8వ నంబరు చౌక దుకాణాన్ని విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. బియ్యం, చక్కెర నిల్వ ఉండాల్సిన స్టాక్ కంటే ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు.
- ఈనెల 4న అనంతపురం రూరల్ మండలం పాపంపేట పరిధిలోని 54వ, 57వ నంబర్ చౌక దుకాణాలను జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ తనిఖీ చేశారు. సరుకు నిల్వల్లో తేడాలు ఉండడంతో డీలర్లపై 6ఏతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.
- హౌసింగ్ బోర్డు ఎల్ఐజీ బస్టాప్ సమీపంలోని చౌక దుకాణంలో రేషన్ బియ్యాన్ని కొత్త సంచుల్లో మూటకట్టి ఆటోలో వేరొక చోటుకు తరలిస్తున్నారు. అక్కడ మిషన్ కుట్టు వేసి సన్నబియ్యం పేరుతో అమ్మేస్తున్నారు. మూడు రోజుల క్రితం ఉదయం పూట రేషన్ బియాన్ని కొత్త సంచుల్లో పోసి ఆటోలో తరలిస్తున్న దృశ్యాలు 'సాక్షి'కి చిక్కాయి. ఈ క్రమంలో ఆ వ్యక్తులు స్టోర్‌ను బంద్ చేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇక్కడ మరో విశేషం ఏమిటంటే... ఏళ్లుగా అక్కడ చౌక దుకాణం నిర్వహిస్తున్నప్పటికీ దానికి స్టోర్ నంబర్ లేదు. దీంతో అది చౌకదుకాణం అని రేషన్ తీసుకెళ్లే కార్డుదారులకు తప్ప ఇతరులకు తెలియదు.

జిల్లాలో...	
చౌక ధరల దుకాణాలు	1,645
బియ్యం కార్డులు	6,60,330
నెలవారీ బియ్యం కోటా	1,01,432.83 క్వింటాళ్లు

తూకం తక్కువగా ఇస్తున్నారు

స్టోర్‌లో బియ్యం తూకం తక్కువగా ఇస్తున్నారు. 35 కిలోల బియ్యం తీసుకుంటే ఐదు కిలోలు తక్కువగా 30 కిలోలే ఇస్తారు. 10 కిలోలు తీసుకునేవారికి రెండు కిలోలు తక్కువగా 8 కిలోలే ఇస్తారు. బియ్యం, సరుకులు రెండు రోజులు ఇచ్చి మానుకుంటున్నారు.

– సునిత, నిర్మలానందనగర్, అనంతపురం

బండ్లు ఉన్నప్పుడే బాగుండె

నేను పొద్దునే పనికిపోతాను. వచ్చేసరికి మధ్యాహ్నం 12 అవుతుంది. అప్పుడు వెళితే స్టోరు మూసి ఉంటుంది. పనులు మానుకుని వెళ్లి లైన్లో నిలబడి బియ్యం తీసుకోవాలి. బండ్లు ఉన్నప్పుడే బాగుండె. మా వీధిలోకి బండి వచ్చినప్పుడు వెళ్లి తెచ్చుకునేదాన్ని.

– భాగ్యమ్మ, నిర్మలానందనగర్, అనంతపురం

మహిళలపై అత్యాచారాలు, దాడులను ఉపేక్షించం

• అనంతపురం రేంజ్ డీఐజీ డాక్టర్ షెముషి



అనంతపురం: అనంతపురం రేంజ్ పరిధిలో మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు, దాడుల ఘటనలు పెరిగిపోతున్నాయని డీఐజీ డాక్టర్ షెముషి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు డీఐజీ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. చిన్నపిల్లలు, మహిళలు, బలహీనులపై ఎవరైనా అత్యాచారాలు, దాడులకు పాల్పడితే ఉపేక్షించబోమని హెచ్చరించారు. పాశవిక ఘటనల్లో పాలుపంచుకునే వారికి ప్రభుత్వ పథకాలు, రాయితీలు అందకుండా ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామన్నారు. రౌడీషీట్లు తెరిచి, జిల్లా నుంచి బహిష్కరించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కొంతమంది రౌడీషీటర్లు అమాయకులను బెదిరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్లుప్తంగా


ఇటుక పెళ్లలు పడి చిన్నారి మృతి

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లి నుంచి పసలూరుకు వెళ్లే మార్గంలో ఇటుక పెళ్లల బట్టీలో పెళ్లలు మీద పడడంతో నాలుగేళ్ల వయసున్న బాలుడు మృతి చెందాడు. సురేష్ అనే వ్యక్తికి చెందిన ఇటుక పెళ్లల పరిశ్రమలో ఈ ఘటన చోటు చేసుకుంది. శికారి తెగకు చెందిన తల్లిదండ్రులిద్దరూ అదే పరిశ్రమలో కూలి పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం పనికి వెళ్లిన సమయంలో రోజు మాదిరిగానే కుమారుడిని కూడా వారు వెంటబెట్టుకుని వెళ్లారు. అక్కడ ట్రాక్టర్ నుంచి పెళ్లలు అన్‌లోడు చేస్తున్న సమయంలో డ్రైవర్ గమనించకుండా లిఫ్ట్ ఎత్తాడు. దీంతో పెళ్లలు బాలుడిపై పడ్డాయి. గుర్తించి వెలికి తీసేలోపు బాలుడు ఊపిరాడక మృతి చెందినట్లు తెలిసింది.

చికిత్స పొందుతూ మహిళ మృతి

రాప్తాడు రూరల్: భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లికి చెందిన వివాహిత చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఇటుకలపల్లి పోలీసులు తెలిపిన మేరకు... ఉప్పరపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ నగేష్... రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సమీప బంధువు బండారు జ్యోతి (19)ని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కొద్దిరోజులు వీరి సంసారం సాఫీగా సాగింది. వీరికి మూడేళ్ల వయసున్న బాబు ఉన్నాడు. ఏడాదిగా మద్యానికి బానిసైన నగేష్ తరచూ భార్యను వేధింపులకు గురి చేస్తూ వచ్చాడు. భార్య ప్రాధేయపడినా అతనిలో మార్పు రాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన జ్యోతి ఈ నెల 8న ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషపూరిత ద్రావకం తాగింది. ఆలస్యంగా గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను సర్వజనాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం ఆమె మృతి చెందింది. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నైరుతి నైరాశ్యం



నైరుతి రుతుపవనాలు ముందస్తుగా వచ్చినా.. భారీ వర్షాల జాడ లేదు. పంటల సాగుకు అప్పులు చేసి పెట్టుబడులు సమకూర్చుకున్న రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అదను సమీపిస్తున్నా చినుకు కురవకపోవడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

- 15 రోజులవుతున్నా ప్రభావం చూపని రుతుపవనాలు
- వేరుశనగ తప్ప ఇతర విత్తనాలు ఇవ్వని ప్రభుత్వం
- ఈ నెల 15 నుంచి పంటల సాగుకు అదను
- 'సుఖీభవ' స్పష్టత లేమితో రైతుల్లో దిగాలు

అనంతపురం అగ్రికల్చర్: అన్నదాత ముంగిటకు ఏరువాక పౌర్ణమి వచ్చింది. బుధవారం నుంచి ఖరీఫ్ కింద పంటలు విత్తుకునేందుకు అదను మొదలైంది. ఈ నెల 22 నుంచి ప్రవేశించనున్న 'ఆరుద్ర'తో విత్తన కార్తెలు కూడా ప్రారంభమవుతాయి. ఈ నెల 15 నుంచి పంటల సాగుకు అనుకూల సమయమని ఇప్పటికే వ్యవసాయ శాస్త్రవేత్తలూ ప్రకటించారు. కానీ కీలకమైన నైరుతి రుతుపవనాల్లో ఉదాసీనత కనిపిస్తోంది. రుతుపవనాలు ప్రవేశించి 15 రోజులవుతున్నా పెద్దగా ప్రభావం చూపడం లేదు. జిల్లాలోని 10 మండలాల్లో ఈ నెల 8న మోస్తరు వర్షపాతం నమోదు కాగా మిగిలిన మండలాల్లో కనీసం 20 మి.మీ వర్షపాతం కూడా నమోదు కాని పరిస్థితి నెలకొంది.

మొహం చాటేసిన వరుణుడు

ఈ సారి నైరుతి ముందస్తుగా అంటే మే 26న జిల్లాలోకి ప్రవేశించడంతో అన్నదాతల్లో హర్షం వ్యక్తమైంది. ముమ్ముందు మంచి వర్షాలు కురుస్తాయని ఆశించారు. అయితే మేఘాలు ఆవరిస్తున్నా వరుణుడు మాత్రం కరుణించలేదు. నైరుతి రాకమునుపు జిల్లా అంతటా మంచి వర్షాలు కురిశాయి. మే 26వ తేదీ వరకు ఏకంగా 100 మి.మీ వర్షపాతం నమోదైంది. అకాల వర్షాలు విస్తారంగా కురిసినా... అసలు సిసలైన ఖరీఫ్ తొలకర్లు మాత్రం పలకరించడం లేదు. నైరుతి ప్రవేశం తర్వాత మే చివరి వారంలో కేవలం 10 మి.మీ వర్షపాతం కూడా నమోదు కాకపోవడం విశేషం. ఇక కీలకమైన జూన్‌లో 61 మి.మీ సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 20 మి.మీ కూడా నమోదు కాలేదు.

అరకొర విత్తనం

ఈ సారి ఖరీఫ్ కింద వర్షాధారంగా 3.06 లక్షల హెక్టార్లు, నీటి వసతి కింద రూ.1.32 లక్షల హెక్టార్లు... ఓవరాల్‌గా 4.38 లక్షల హెక్టార్లలో పంటలు సాగు చేస్తారని అధికారులు అంచనా వేశారు. అయితే ఈ ఏడాది జిల్లాకు కూటమి సర్కార్ అరకొర రాయితీ విత్తన కేటాయింపులు చేసింది. గతానికి భిన్నంగా ఈ సారి కేవలం 54 వేల క్వింటాళ్లతో విత్తన ప్రణాళిక అమలు చేస్తున్నారు. అది కూడా కేవలం విత్తన వేరుశనగ మాత్రం పంపిణీ మొదలు పెట్టారు. కందులు, కొర్రలు, పెసలు, అలసంద, మినుములు, రాగులు, అలాగే జీనుమ, జలుగు, పిల్లిపెసర లాంటి పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా కాలేదు. పరిస్థితి చూస్తే 20 వేల నుంచి 25 వేల క్వింటాళ్ల వేరుశనగ అందించి అపేసేలా ఉన్నారు.

'సుఖీభవ' ఎపుడో?

'అన్నదాత సుఖీభవ' అంటూ ఏడాదిగా కూటమి సర్కార్ ఊరిస్తున్నా ఇప్పటికీ స్పష్టత ఇవ్వకుండా దగా చేస్తున్న పరిస్థితి నెలకొంది. ఇప్పటికే ఏడాది ముగిసింది. పీఎం కిసాన్ రూ.6 వేలు మినహాయిస్తే రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద రూ.14 వేలు ఇవ్వకుండా జిల్లా రైతులకు ఏకంగా రూ.400 కోట్లు ఎగ్గొట్టేసింది. ఈ సారైనా సకాలంలో ఇస్తే పెట్టుబడి సాయం కింద వెసులుబాటు ఉంటుందని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

అధినేతతో ప్రవాసాంధ్రుల భేటీ



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన ప్రవాసాంధ్రులు (చిత్రంలో) ఆలూరు సాంబశివారెడ్డి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ప్రవాసాంధ్రులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారి వెంట వైఎస్సార్‌సీపీ ఎన్ఆర్ఐ గ్లోబల్ వింగ్ కో–ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి ఉన్నారు. వివిధ దేశాల నుంచి వచ్చిన ప్రవాసాంధ్రులను వైఎస్ జగన్‌కు ఆయన పరిచయం చేశారు. పార్టీ అధినేతను కలసిన వారిలో ఇలియాస్ (వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్), మర్రి కళ్యాణ్ (కో–కన్వీనర్, కువైట్), జాఫర్ హుస్సేన్ (కో–కన్వీనర్, ఖతార్), వీపీ రామచంద్రారెడ్డి(అడ్వైజర్, కువైట్), గజ్జల నర్సారెడ్డి (అడ్వైజర్, కువైట్), షేక్ సబ్దర్ (ఈసీ, కువైట్), షేక్ ఇలాహి (కమిటీ సభ్యుడు, సౌదీ అరేబియా), చంద్రలేఖ, శ్రీనివాసరెడ్డి (అట్లాంటా, యూఎస్ఏ), సాయికొప్పినేని (మెల్‌బోర్న్, ఆస్ట్రేలియా) ఉన్నారు.

మోదీ పాలన స్వర్ణ యుగం

- రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

అనంతపురం టవర్‌క్లాక్: కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు గడిచిందని, ఈ 11 ఏళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థను ప్రధాని నరేంద్ర మోదీ పటిష్టం చేసి స్వర్ణ యుగంలా మార్చాడని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్కరణల అమలుతో దేశాభివృద్ధికి ప్రధాని మోదీ బాటలు వేశారన్నారు. ప్రధానంగా రైతులు, పేదలు, యువకులు, మహిళల అభ్యున్నతికి పెద్ద పీట వేశారన్నారు. ఇటీవల పాకిస్తాన్ విషయంలో ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయాలు విద్రోహులను ముప్పతిప్పలు పెట్టాయన్నారు. ఆపరేషన్ సింధూర్‌తో పాకిస్తాన్ తోక ముడిచేలా చేశారన్నారు. సాధ్యం కాని ఎన్నో పనులను ఆచరణలో పెట్టి చూపారన్నారు. అధికారం కట్టబెట్టిన ప్రజల రుణం తీర్చుకునేలా మరిన్ని సంక్షేమ పథకాలను ప్రవేశపెడతామని పేర్కొన్నారు.

నేడు మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాక

అనంతపురం అర్బన్: రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి అరుణ జిల్లాలో రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. బుధవారం రాత్రి 7.30 గంటలకు అనంతపురం చేరుకుని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో విశ్రాంతి తీసుకుంటారు. 12న ఉదయం 9 గంటలకు అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడతారు. ఉదయం 10 గంటలకు ప్రభుత్వ ఆస్పత్రిలోని సఖి కేంద్రాన్ని సందర్శించి అక్కడ ఆశ్రయం పొందుతున్న దళిత మైనర్ బాలికను పరామర్శిస్తారు. అనంతరం ఉదయం 11 గంటలకు ఇటీవల హత్యకు గురైన ఇంటర్ విద్యార్థి తన్మయి కుటుంబాన్ని పరామర్శిస్తారు. మధ్యాహ్నం రెండు గంటలకు బయలుదేరి వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరుకు వెళతారు.

ఆపన్నహస్తం కోసం బాలుడి ఎదురుచూపు



క్యాన్సర్‌తో బాధపడుతున్న సంతోష్

పెద్దపప్పూరు: కూలి పనికి వెళితే తప్ప పూటగడవని నిరుపేద కుటుంబానికి పెద్ద కష్టమే వచ్చిపడింది. వివరాలు.. పెద్దపప్పూరు మండలం శింగనగుట్టపల్లికి చెందిన రామ్మోహన్, రేణుక దంపతులకు 12 ఏళ్ల వయసున్న కుమారుడు సంతోష్ ఉన్నాడు. చదువులో ప్రతిభ కనబరిచి మూడు నెలల క్రితం లేపాక్షిలోని గురుకుల పాఠశాలలో ఆరో తరగతిలో అడ్మిషన్ పొందాడు. ఈ క్రమంలో కొన్ని రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు లోను కావడంతో తల్లిదండ్రులు బెంగళూరులోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు లింపోబ్లాస్టిక్ లుకేమియా అనే క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లుగా నిర్ధారించి హైదరాబాద్‌లోని బసవతారకం ఆస్పత్రికి రెఫర్ చేశారు. ప్రస్తుతం ఆ బాలుడి చికిత్సకు రూ.15 లక్షలు అవసరం కాగా, గ్రామస్తులు రూ.2లక్షలను పోగు చేసి అందజేశారు. దాతలు సహకరిస్తే తమ కుమారుడి ప్రాణాలు దక్కుతాయని నిరుపేద తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. ఆపన్న హస్తమందించి ఆదుకోవాలని కోరుతున్నారు. మానవతావాదులు ఎవరైనా స్పందించి 63000 49974 నంబర్‌కు ఫోన్‌పే ద్వారా ఆర్థిక సాయం అందించాలని అభ్యర్థిస్తున్నారు.

ఆర్డీటీ మూతపడితే చరిత్ర హీనులవుతారు



తలారి రంగయ్య పాదయాత్రలో పాల్గొన్న వెన్నపూస రవీంద్రారెడ్డి, గౌని ఉపేంద్రరెడ్డి, ఉమామహేశ్వర నాయుడు, కళేకుర్తి జయరామిరెడ్డి, తదితరులు

- వైఎస్సార్‌సీపీ పీఆర్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస

కుందుర్పి: రాయలసీమ ప్రాంతంలో పేదరికాన్ని రూపుమాపేందుకు 55 ఏళ్లుగా ఎన్నో విశిష్ట సేవలు అందిస్తున్న ఆర్డీటీని మూతపడేలా చేస్తే చరిత్ర హీనులు కాకతప్పదని కూటమి ప్రభుత్వాన్ని వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ (పీఆర్) విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి హెచ్చరించారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల చాంబర్లలోని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలను తొలగించడంపై టీడీపీ నాయకులకు ఉన్న శ్రద్ధ ఆర్డీటీని కాపాడటంలో లేదని మండిపడ్డారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ చేయాలనే డిమాండ్‌తో కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య చేపట్టిన పాదయాత్ర మంగళవారం కుందుర్పి మండలం కరిగానిపల్లికి చేరుకుంది. యాత్రకు రవీంద్రారెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కరిగానిపల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, రైతాంగానికి ఆర్డీటీ అన్ని రకాలుగా చేదోడు ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టక మునుపే జిల్లాలో ఆర్డీటీ ద్వారా మహోన్నత సేవా కార్యక్రమాలను డాక్టర్ ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ చేపట్టారన్నారు. అలాంటి సంస్థకు విదేశీ నిధులు అందకుండా గొంతు కోసే దుర్మార్గమైన చర్యకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెరతీశాయని మండిపడ్డారు. ఆర్డీటీ కోసం ప్రజలలో చైతన్యం తీసుకువచ్చేందుకు డాక్టర్ తలారి రంగయ్య చేపట్టిన పాదయాత్రను అడ్డుకునేందుకు టీడీపీ పెద్దలు విశ్వ ప్రయత్నాలు చేయడం సిగ్గుచేటన్నారు.నిజంగా ఈ ప్రాంత అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే ఆర్డీటీని కాపాడుకునేందుకు స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుతో పాటు ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు, స్థానిక ప్రజాప్రతినిధులు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, పార్టీ నేత మాదినేని ఉమామహేశ్వర నాయుడు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్, రాయదుర్గం మున్సిపల్ మాజీ చైర్మన్ గౌని ఉపేంద్రారెడ్డి, సత్యనారాయణరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఎనుములదొడ్డి సర్పంచ్ విజయ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

తోపులాటలో రాయిపై పడి వ్యక్తి మృతి

రాప్తాడు రూరల్: ఇరు వర్గాల మధ్య చోటు చేసుకున్న తోపులాటలో ఓ వ్యక్తి రాయిపై పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీ నల్లనరసింగయ్యకాలనీకి చెందిన రెడ్డివారి కోనయ్య (76) కుమార్తె నాగమణికి 5 సెంట్లకు పైగా స్థలం ఉంది. విదేశాల్లో స్థిరపడిన ఆమె ఇటీవల ఆ స్థలంలో ఇల్లు నిర్మించాలని భావించి విషయాన్ని తండ్రికి తెలపడంతో ఆయన వెళ్లి స్థలాన్ని శుభ్రం చేయించాడు. మంగళవారం మార్కింగ్ వేయిస్తున్న క్రమంలో పక్కనే ఉన్న వీరి బంధువు గంగాధర్ జోక్యం చేసుకున్నాడు. ఇంటి ముందు 20 అడుగుల రోడ్డు ఉంటే రెండు అడుగుల మేర ఆక్రమించి మార్కింగ్ వేయిస్తున్నారంటూ గొడవకు దిగాడు. డాక్యుమెంట్‌లో ఉన్న మేరకే మార్కింగ్ వేయిస్తున్నాని రెడ్డివారి కోనయ్య బదులిచ్చినా వినలేదు. ఆ సమయంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. అసహనానికి లోనైన గంగాధర్ ఒక్కఉదుటున కోనయ్యను గట్టిగా తోయడంతో ఆయన వెనుక వైపు పడిపోయాడు. ఈ క్రమంలో రాయిపై తల పడడంతో తీవ్ర గాయమైంది. వెంటనే సర్వజనాస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుమారుడు రెడ్డివారి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఆటో బోల్తా .. ఒకరి మృతి



మృతురాలు శివవేణి

కూడేరు: మండలంలోని జల్లిపల్లి సమీపంలో జాతీయ రహదారిపై ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురంలోని కోర్టు రోడ్డులో నివాసముంటున్న ఆనంద్, శివవేణి (28) దంపతులు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ నేపథ్యంలో ఇద్దరు పిల్లలు, మరో ఇద్దరు మహిళలతో కలసి ఆనంద్ దంపతులు, సొంత ఆటోలో పీఏబీఆర్ చూసేందుకు వెళ్లారు. అక్కడే భోజనం ముగించుకుని సరదాగా గడిపిన అనంతరం తిరుగు ప్రయాణమైన వారు జల్లిపల్లి సమీపంలోకి రాగానే ఉన్నఫళంగా రోడ్డుకు అడ్డంగా వచ్చిన గేదెను తప్పించే క్రమంలో ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఘటనలో శివవేణి అక్కడికక్కడే మృతి చెందింది. ఆనంద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పద్మ, సుంకమ్మ, ఇద్దరు పిల్లలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో సర్వజనాస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

అనంతపురం: పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఏసీ టెక్నీషియన్ ఎ.అజయ్‌కుమార్ ప్రమాదవశాత్తుకు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. అనంతపురంలోని కోర్టు రోడ్డులో నూతనంగా జోడియో షో రూమ్ ఏర్పాటవుతోంది. ఈ క్రమంలో షో రూమ్‌లో విద్యుత్ ఉపకరణాలను బిగించేందుకు అజయ్‌కుమార్ వచ్చాడు. మంగళవారం ఏసీ బిగిస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ ప్రసరించడంతో అక్కడికక్కడే కుప్పకూలి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన తోటి కార్మికులు వెంటనే ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అజయ్‌కుమార్ మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై రెండో పట్టణ పీఎస్ ఇన్‌చార్జ్ సీఐ కె.శాంతిలాల్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఇంకెన్నాళ్లు పస్తులుంచుతారు?

- శ్రీరామరెడ్డి తాగునీటి సరఫరా పథకం కార్మికుల ఆవేదన
- నాలుగున్నర నెలలుగా అందని వేతనం
- కుటుంబ సభ్యులతో కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట కుటుంబసభ్యులతో బైఠాయించి ధర్నా చేస్తున్న నీలకంఠారెడ్డి ప్రాజెక్టు కార్మికులు

అనంతపురం అర్బన్: 'శరీర కష్టంతో బతుకుతున్న మమ్మలి ఇంకెంత కాలం పస్తులుంచుతారు? నాలుగున్నర నెలలుగా వేతనాలు ఇవ్వకపోతే కుటుంబాలను ఎలా పోషించుకోవాలి? కనికరం లేని ఈ ప్రభుత్వానికి మా ఉసురు తగలకపోదు' అంటూ శ్రీరామరెడ్డి తాగునీటి సరఫరా పథకం కార్మిక కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేశాయి. సమస్యలు పరిష్కరించాలంటూ కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం కలెక్టరేట్ ఎదుట కార్మికులు బైఠాయించి ధర్నా చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్రిస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, అధ్యక్షురాలు నాగమణి, నీటి ప్రాజెక్టు కార్మిక సంఘం కార్యదర్శి రాము మాట్లాడారు. నీటి ప్రాజెక్టు కార్మికుల సమస్యలను ప్రభుత్వం, అధికారులు విస్మరిస్తున్నారని మండిపడ్డారు. పరిష్కరించాలన్న చిత్తశుద్ధి ఏ ఒక్కరిలోనూ కనిపించడం లేదన్నారు. రెండు నెలలుగా సమ్మె చేస్తున్నా కనీసంగానూ స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఫేజ్–1 ట్రంక్‌లైన్ కార్మికులకు నాలుగున్నర నెలల వేతనాలు, 24 నెలల పీఎఫ్ చెల్లించాల్సి ఉందన్నారు. కార్మికుల వేతనం నుంచి కోత విధించిన రూ.2,500ను తక్షణమే చెల్లించాలన్నారు. ఫేజ్–4 రాయదుర్గం, కళ్యాణదుర్గం కార్మికులకు సంబంధించి గతంలో జరిగిన ఒప్పందాన్ని అమలు చేయాలన్నారు. కార్మికుల సంఖ్యను తగ్గించరాదని డిమాండ్ చేశారు. తాగునీటి సంస్థలకు ప్రభుత్వం బడ్జెట్ కేటాయించాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. గ్రాట్యూటీ, ఈఎస్ఐ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నీటి ప్రాజెక్టు కార్మిక సంఘం నాయకులు నారేష్, నాగరాజు, రామాంజనేయులు, కార్మికుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల బరితెగింపు

- పలువురిపై కర్రలతో దాడి
- దానిమ్మ చెట్ల నరికివేత



జె.వెంకటంపల్లి గ్రామ సమీపంలో దానిమ్మ చెట్లను నరికి వేసిన దృశ్యం



టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన హనుమంతరెడ్డి, అనంతమ్మ

గుమ్మఘట్ట: మండలంలోని జె.వెంకటంపల్లి గ్రామంలో టీడీపీ నేతలు బరి తెగించారు. గ్రామ సమీపంలో రస్తా విషయంగా గొడవపడి నలుగురిపై కట్టెలతో విచక్షణారహితంగా దాడి చేశారు. అంతటితో ఆగకుండ 6 సంవత్సరాల వయస్సున్న 30 దానిమ్మ చెట్లను నరికివేశారు. బాధితులు తెలిపిన మేరకు... గ్రామానికి చెందిన ఈశ్వరరెడ్డి, హనుమంతరెడ్డి అన్నదమ్ములు. వీరి పొలం నుంచి అదే గ్రామానికి చెందిన తమ పొలాలకు దారి ఉందని టీడీపీ నాయకులు సందీప్, వినయ్ దివాకరరెడ్డి గొడవ పడేవారు. ఈ విషయంపై ఐదేళ్లుగా కోర్టు పరిధిలో వివాదం నడుస్తోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టీడీపీ నేతలు చెలరేగిపోయారు. ఈ క్రమంలో కక్ష సాధింపు చర్యల్లో భాగంగా మంగళవారం తోటలో హనుమంతరెడ్డి ఒక్కడే ఉన్నాడనే విషయం తెలుసుకుని వినయ్, సందీప్, దివాకర్‌రెడ్డి, ఈశ్వరరెడ్డి, కమలమ్మ, సువర్ణమ్మ చుట్టుముట్టి కట్టెలతో మూకుమ్మడిగా దాడి చేశారు. అక్కడికి సమీపంలో ఉన్న రంగారెడ్డి, ఆయన భార్య అనంతమ్మ అడ్డుకోబోవడంతో వారిపై కూడా దాడికి తెగబడ్డారు. అనంతరం 30 దానిమ్మ చెట్లను అడ్డంగా నరికివేశారు. విషయం తెలుసుకున్న హనుమంతరెడ్డి సోదరుడు ఈశ్వరరెడ్డి అక్కడకు చేరుకోవడంతో ఆయనను సైతం చుట్టుముట్టి దాడి చేసి గాయపరిచారు. క్షతగాత్రులను స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా రాయదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న రంగారెడ్డిని మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తీసుకెళ్లారు. కాగా, ఘటనపై దాడి చేసిన వారితో పాటు బాధితులపై కూడా పోలీసులు కేసు నమోదు చేయడం వివాదస్పదమైంది. దాడికి పాల్పడిన టీడీపీ నేతలకు పోలీసులు అండగా నిలుస్తున్నారనే విమర్శలు గ్రామంలో వ్యక్తమయ్యాయి.

'జన్విత'లో మహిళ మృతి



ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

అనంతపురం మెడికల్: నగరంలోని సూర్యనగర్‌లో ఉన్న జన్విత ఆస్పత్రిలో ఓ మహిళ మృతి వివాదాస్పదంగా మారింది. మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబ సభ్యులు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. వివరాలు.. అనారోగ్యంతో బాధపడుతున్న గార్లదిన్నె మండలం ఇల్లూరు గ్రామానికి చెందిన హుస్సేన్‌బీ (48) ఈ నెల 7న జన్విత ఆస్పత్రిలో చేరింది. ఆమె గర్భసంచిలో గడ్డ ఉన్నట్లుగా గుర్తించిన వైద్యురాలు మరుసటి రోజున శస్త్రచికిత్స చేసి తొలగించారు. మంగళవారం కడుపు ఉబ్బరంగా ఉందంటూ బాధపడుతుండడంతో స్కాన్‌కు రెఫర్ చేశారు. కాగా, స్కాన్ తీయించుకుని ఆస్పత్రికి చేరుకోగానే హుస్సేన్‌బీ మృతి చెందింది. కార్డియాక్ అరెస్ట్‌తో మృతి చెందినట్లు అదే ఆస్పత్రి వైద్యులు నిర్ధారించారు. కాగా, మృతికి ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆందోళనకు దిగడంతో సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని సర్దిచెప్పారు. విషయం తెలుసుకున్న డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి సదరు ఆస్పత్రికి చేరుకుని మృతిపై ఆరా తీశారు.

క్లుప్తంగా

ఫ్లోరోసిస్‌పై అవగాహన


ఫ్లోరోసిస్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం ఫ్లోరోసిస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ ఆంజనేయులు, డాక్టర్ నారాయణస్వామి మాట్లాడుతూ వైద్య సిబ్బంది ప్రజలకు ఫ్లోరోసిస్‌పై అవగాహన కల్పించాలన్నారు. క్షేత్రస్థాయికి వెళ్లినప్పుడు మల్టివిటమిన్ మాత్రలతో పాటు ఆహారపు అలవాట్లు గురించి వివరించాలన్నారు. వాటర్ శ్యాంపిల్స్‌ను సేకరించి అవసరం ఉన్న వారికి పునరావాస పరికరాలు పంపిణీ చేయాలని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఫ్లోరోసిస్ బాధితులకు చేతి కర్రలు, వాకర్స్, నడుము, మెడ బెల్టులు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ కిశోర్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి


మంగలి నరేష్ (ఫైల్)

కనగానపల్లి: బాలేపాళ్యం గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మంగలి నరేష్ (23) అనారోగ్యంతో మృతి చెందాడు. స్థానిక తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన సుబ్బరాయుడు, పద్మావతి దంపతుల కుమారుడు గతంలో గ్రామ వలంటీర్‌గా పనిచేస్తుండేవాడు. వారం రోజుల క్రితం గుండెపోటుకు గురైన అతన్ని బెంగుళూరులోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మంగళవారం అక్కడే మృతి చెందాడు. దీంతో చేతికి వచ్చిన కొడుకు అకస్మాత్తుగా మృతి చెందటంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు దుఃఖ సాగరంలో మునిగిపోయారు.

కార్మికుల వేతనాలు చెల్లించాలి


వైద్య కళాశాల ఆవరణలో ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ వైద్య కళాశాలలో విధులు నిర్వర్తించే పారిశుధ్య కార్మికులకు బకాయి ఉన్న 3 నెలల వేతనాలు చెల్లించాలంటూ ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్, ఏఐటీయూసీ నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం ప్రభుత్వ వైద్య కళాశాల ముందు వారు ధర్నా చేపట్టారు. నెలలు తరబడి వేతనాలు రాకపోతే ఎలాగని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు వేతనాలు ఇవ్వకపోతే దశలవారీగా ఆందోళన చేపడుతామని అసోసియేషన్ నాయకులు రాజేష్‌గౌడ్, కృష్ణుడు, మనోహర్, శోభ, ప్రశాంత్, లక్ష్మీదేవి తదితరులు పేర్కొన్నారు.

మాతా, శిశు మరణాల నివారణకు కృషి చేయాలి


సమీక్ష నిర్వహిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి

అనంతపురం మెడికల్: మాతా, శిశు మరణాల నివారణకు కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో గత నెలలో జరిగిన రెండు మాతృ, ఆరు శిశు మరణాలపై సమీక్ష నిర్వహించారు. హైరిస్క్ కేసుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గర్భందాల్చినప్పటి నుంచి రెగ్యులర్‌గా యాంటినేటల్ చెకప్స్ జరిగేలా చూడాలన్నారు. మరణాల విషయంలో నిర్లక్ష్యం కనిపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ యుగంధర్, గైనకాలజిస్టు డాక్టర్ నిస్సార్ బేగం, అనస్థీషియా హెచ్‌ఓడీ డాక్టర్ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మ్యానువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా పరిషత్, మండల పరిషత్ యాజమాన్య పాఠశాలల టీచర్ల మాదిరిగానే మునిసిపల్ పాఠశాలల టీచర్లకు మ్యానువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయనతో పాటు యూటీఎఫ్ శ్రీసత్యసాయి జిల్లా ప్రధానకార్యదర్శి సుధాకర్ కలిసి డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మునిసిపల్, మైనర్ మీడియం టీచర్లకూ బదిలీలకు మ్యానువల్ కౌన్సెలింగ్ చేపట్టేలా చూడాలని కోరారు. సీనియార్టీ జాబితాలోని అసంబద్ధాలను తొలిగించాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు

రాప్తాడు: కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో మహిళలు, బాలికలకు రక్షణ లేకుండా పోయిందని వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజన విద్యార్థి తన్మయి హత్య, రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లి దళిత మైనర్ బాలికపై అత్యాచారాన్ని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా రాష్ట్రంలో మహిళలు, బాలికలకు రక్షణ కల్పించాలని కోరుతూ అంబేడ్కర్ చిత్రపటానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ రాప్తాడు నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రెసిడెండ్ ఓబులేష్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ ప్రకాష్ బాబు, వైఎస్సార్ సీపీ మహిళ జిల్లా అధ్యక్షురాలు ఉషారాణి మాట్లాడుతూ పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే సీఎం చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారన్నారు. పోలీసులు సకాలంలో స్పందించి ఉంటే విద్యార్థిని తన్మయి హత్యకు గురయ్యేది కాదరు. మైనర్ బాలికపై అత్యాచార ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలులో ఉందని విమర్శించారు. దళిత, గిరిజన యువతులపై వరుసగా అత్యాచారం, హత్య జరిగితే రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, హోం మంత్రి అనిత స్పందించక పోవటం సిగ్గు చేటన్నారు. అనంతపురం రూరల్ జెడ్పీటీసీ చంద్రాకుమార్, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, యూత్ మండల కన్వీనర్ విశ్వనాథ్‌రెడ్డి, రాప్తాడు, చెన్నేకొత్తపల్లి, అనంతపురం రూరల్ మహిళ మండల కన్వీనర్లు వరలక్ష్మి, రజిని, అనిత, మహిళలు శివమ్మ, అనిత, లక్ష్మీదేవి, ప్రభావతి, నాయకులు రవికుమార్, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నిందితున్ని శిక్షించాలని కోరుతూ ర్యాలీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


రాప్తాడులో అంబేడ్కర్ చిత్రపటానికి వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

అనంతపురం రూరల్: కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలోని మహిళలకు రక్షణ కరువైందని వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ విభాగం సంయుక్త కార్యదర్శి సాధిక్‌వలి, రుద్రంపేట ఎంపీటీసీ సభ్యురాలు మహబూబీ ఆందోళన వ్యక్తం చేశారు. రామకృష్ణ కాలనీకి చెందిన తన్మయిని దారుణంగా హత్య చేసిన నిందితున్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రుద్రంపేట నుంచి జిల్లా పరిషత్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సాదిక్‌వలి, మహబూబీ మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయన్నారు. మహిళలు, బాలికలపై హత్యాచారాలు, దాడులు జరుగుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సిగ్గు చేటన్నారు. తన్మయిని హత్య చేసిన నిందితున్ని కఠినంగా శిక్షించి బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు


ప్రతిజ్ఞ చేస్తున్న బాలికలు, తల్లులు

అనంతపురం ఎడ్యుకేషన్: బాల్య వివాహాలతో అనేక అనర్థాలు తప్పవని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయశ్రీ పేర్కొన్నారు. అనంతపురం రూరల్ 5వ సెక్టార్ పరిధిలోని విద్యారణ్య నగర్ –2 అంగన్వాడీ కేంద్రంలో కిశోరి వికాసం వేసవి శిక్షణలో భాగంగా చివరి రోజు మంగళవారం బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జయశ్రీ మాట్లాడుతూ చిన్న వయసులోనే అమ్మాయిలకు పెళ్లిళ్లు చేయడం వలన శారీరకంగా, ఆరోగ్యపరంగా చాలా సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. చిన్న వయసులో గర్భం దాల్చినా ప్రసవ సమయంలో చాలా ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. ఒక్కోసారి ప్రాణాంతకంగా మారే అవకాశం ఉంటుందని తెలిపారు. అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు నిండిన తర్వాతనే వివాహం చేయాలన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగితే వెంటనే పోలీసులు లేదా ఐసీడీఎస్, బాలల సంరక్షణ సమితి సభ్యులకు, 1098 కు సమాచారం అందించాలన్నారు. బాల్య వివాహాలు జరగకుండా చూస్తామని కిశోర బాలికలు, తల్లులతో ప్రతిజ్ఞ చేయించారు. మహిళా పోలీస్ హరిత, అంగన్వాడీ కార్యకర్తలు అరుణ, చంద్రకళ, మాధవి, గౌతమి, శంకరమ్మ, లక్ష్మీదేవి, సరస్వతి పాల్గొన్నారు.

వేళలు పాటించకపోతే చర్యలు

అనంతపురం సెంట్రల్: అంగన్‌వాడీ కేంద్రాలు ఉదయం 9 నుంచి 4 గంటలకు తెరిచేఉండాలని, అనుమతి లేకుండా సిబ్బంది గైర్హాజరైనా చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ అనంతపురం అర్బన్ సీడీపీఓ అనురాధ హెచ్చరించారు. మంగళవారం బాధ్యతలు స్వీకరించిన ఆమె నగరంలో పలు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. పాతూరులోని బర్మప్ప అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసంపై బాలికలకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలు, ఆడపిల్లలు పౌష్టికాహారం తీసుకోకపోవడం వలన కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ భారతి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి కార్యాలయాలపై దాడులు సరికాదు


సీఐ శ్రీధర్‌కు ఫిర్యాదు చేస్తున్న సాక్షి పాత్రికేయ బృందం

కనగానపల్లి: పత్రికా స్వేచ్ఛను హరిస్తూ సాక్షి కార్యాలయాలపై దాడులు చేయటం సరికాదని పలువురు జర్నలిస్టులు తీవ్రంగా ఖండించారు. సాక్షి కార్యాలయాలపై దాడులు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలంటూ రాప్తాడు నియోజకవర్గంలోని పలువురు జర్నలిస్టులు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి, రామగిరి మండలాల్లోని సాక్షి విలేకర్లు, ఇతర మీడియా సంస్థల ప్రతినిధులు చెనేకొత్తపల్లిలోని రామగిరి సర్కిల్ కార్యాలయంలో సీఐ శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ డిబేట్‌లో పాల్గొన్న ఒక జర్నలిస్టు చేసిన వాఖ్యాలను సాక్షి ఛానల్‌పై ఆపాదిస్తూ సాక్షి కార్యాలయాలపై టీడీపీ మూకలు దాడులకు పాల్పడటం తగదన్నారు. ఈ దాడులకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. ఇదే విషయంలో సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాస్‌ను పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలిచంటం హేయమన్నారు. ఈ కార్యక్రమంలో సాక్షి రాప్తాడు ఆర్సీ ఇన్‌చార్జ్ మహదేవ రెడ్డి, పాత్రికేయులు చెన్నేకొత్తపల్లి మురళీధర్, రామగిరి అశోక్‌కుమార్, సాక్షి టీవీ విలేకరి ఇలియాజ్‌భాషా, తదితరులు పాల్గొన్నారు.

పాత సమయాన్నే కొనసాగించాలి


వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: గ్రామీణ ప్రాంతాల విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ కళాశాల సమయాన్ని పాత విధానంలోనే కొనసాగించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఇంటర్ బోర్డు ఆర్ఐఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ సురేఖకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గతంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించేవారన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించాలని కొత్త నిబంధన తీసుకురావడాన్ని ఖండించారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మహిళలు, విద్యార్థినులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కొందరు దుండగులు విచ్చలవిడిగా అమ్మాయిలపై అత్యాచారాలు, మానభంగాలు చేస్తున్నారన్నారు. పల్లె ప్రాంతాల విద్యార్థినులు సాయంత్రం పూట ఆటోలు, బస్సుల్లో వెళ్లడం ఆలస్యం అవుతుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. ప్రభుత్వం కళాశాలల సమయాన్ని పాత పద్ధతిలోనే కొనసాగించేలా చూడాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు, నగర అధ్యక్షుడు మంజునాథ్, సహాయ కార్యదర్శి సమీర్, నాయకులు తరుణ్ పాల్గొన్నారు.

కళాకారులకు ప్రతిభా పురస్కారాలు

అనంతపురం కల్చరల్: తమదైన శైలితో అనంత రంగస్థలానికి విశేష కృషి చేస్తున్న పలువురు కళాకారులు నందమూరి ప్రతిభా పురస్కారాలనందుకున్నారు. ఈ మేరకు మంగళవారం రాత్రి పద్మశ్రీ ఘంటసాల సంగీత కళాభారతి ఆధ్వర్యంలో సంగీత విభావరి వీనుల విందుగా సాగింది. పాత కొత్త పాటల మేలుకలయికతో సాగిన విభావరిలో సురేష్, ఆచార్య సుధాకరబాబు, జ్యోతి, శ్రీదేవి తదితరులు మధురమైన పాటలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా సుగుమంచి సురేష్, వీఎంపీ నాయుడు మాట్లాడుతూ దశాబ్దాలుగా అనంత కళాకారులు రాష్ట్రస్థాయిలో సంగీత, నాటకాలకు ఎనలేని సేవలందిస్తున్నారని వారిని గుర్తించి గౌరవించడం బాధ్యతగా తీసుకున్నామన్నారు. అనంతరం కళారంగ సేవకులు జీవీరామయ్య, సీనియర్ గాయకులు పాలసముద్రం నాగరాజు, ఎల్కేపి కార్యదర్శి గాజుల పద్మజ, సామాజిక సేవా కార్యకర్త రవికాంత్ రమణ, నాగన్న తదితరులకు ప్రతిభా అవార్డులనందించి ఘనంగా సత్కరించారు.

విద్యతోనే బాలికల సమగ్ర వికాసం


పోస్టర్లు, పుస్తకాలను విడుదల చేస్తున్న ఐసీడీఎస్, రెడ్ సంస్థ ప్రతినిధులు

రాప్తాడు: విద్య ద్వారానే బాలికల సమగ్ర వికాసం సాధ్యమని రెడ్ సంస్థ ప్రతినిధి భానుజా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్న పేర్కొన్నారు. మండలంలో గత నెల 2 నుంచి ఈ నెల 10వ తేదీ వరకు కిశోరి వికాసం పేరుతో కిశోర బాలికలకు నిర్వహించిన అవగాహన సదస్సులు మంగళవారం ముగిశాయి. సమావేశానికి రెడ్ సంస్థ ప్రతినిధి భానుజా, జిల్లా బాలల పరిరక్షణ సమితి వెంకట్ కుమార్ హాజరై మాట్లాడారు. బాలికలు క్రమశిక్షణతో మెలుగుతూ బాగా చదువుకుని స్వశక్తితో నిలబడాలన్నారు. ముఖ్యంగా కిశోర బాలికలు పోక్సో చట్టం, బాలల హక్కులు, లింగ వివక్ష తదితర అంశాలను తెలుసుకోవాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం ఆవశ్యకత, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా పోలీసు షాజియా, అంగన్‌వాడీ వర్కర్లు విజయలక్ష్మీ, లక్ష్మీదేవి, భారతి, ముత్యాలమ్మ, సావిత్రి, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వాడకం ఆరోగ్యానికి హానికరం



ఆత్మకూరులో ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసులు, వైద్య సిబ్బంది

ఆత్మకూరు: పొగాకు వాడకం ఆరోగ్యానికి హానికరమని పొగాకు నియంత్రణ అధికారి డాక్టర్ నారాయణస్వామి, సీఐ హేమంత్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం పొగాకు వ్యతిరేక పక్షోత్సవాల్లో భాగంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ నారాయణస్వామి పొగాకు ఉత్పత్తులతో కలిగే దుష్ప్రభావాలను తెలియజేశారు. ప్రజలందరూ వాటికి దూరంగా ఉండాలని సూచించారు. పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో పొగాకు ఉత్పత్తులను అమ్మకూడదని, అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం తీసుకుంటామని సీఐ తెలిపారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాలకు వంద గజాలలోపు ఎవరైనా పొగాకు విక్రయిస్తే రూ.200 జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మణరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గొర్రెలకు నీలి నాలుక టీకాలు


గొర్రెలకు టీకాలు వేస్తున్న వైద్యులు

శింగనమల: నీలినాలుక వ్యాధి ప్రభావితం ఉన్న గ్రామాల్లో ముందస్తుగా గొర్రెలకు టీకాలు వేస్తున్నట్లు అనంతపురం డివిజన్ పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకుడు రమేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని శివపురం గ్రామంలో గొర్రెలకు ఉచితంగా నీలి నాలుక టీకాలు వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 1 నుంచి నీలినాలుక వ్యాధి ప్రభావిత ప్రాంతాల్లోని గొర్రెలకు టీకాలు వేస్తున్నామన్నారు. గొర్రెల కాపర్లు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో శింగనమల ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకుడు, పద్మనాభం సలకం చెరువు పశువైద్యాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది వరలక్ష్మి, హరికృష్ణ, సాయి, ఫయాజ్‌బాషా పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు ప్రారంభం


తైక్వాండో పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని సత్యసాయి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం రాష్ట్రస్థాయి తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలను సీఐ శివగంగాధర్‌రెడ్డి, డాక్టర్ మురళీధర్‌రెడ్డి ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరిగే పోటీల్లో దాదాపు 550 మంది క్రీడాకారులు పాల్గొననున్నారని తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి .వేణుగోపాల్ రావు తెలిపారు. విజేతలు ఈనెల 23 నుంచి 25 వరకు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

మున్సిపల్ ఉద్యోగి మృతి

బుక్కరాయసముద్రం: మండలంలోని బాట్లో కొత్తపల్లిలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. బాట్లో కొత్తపల్లికి చెందిన రామాంజనేయులు(50) అనంతపురంలో మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. ఆయన అనంతపురం నుంచి బస్సు దిగి రోడ్డు దాటుతుండగా బెంగళూరు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న తెలంగాణాకు చెందిన ఫార్చునర్ కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో రామాంజినేయులు అక్కడికక్కడే మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పక్కాగా మస్టర్ నమోదు చేయాలి

- డ్వామా పీడీ సలీం బాషా


కూలీల మస్టర్‌ను పరిశీలిస్తున్న పీడీ సలీంబాషా

కూడేరు: ఉపాధి కూలీల మస్టర్‌ను పక్కాగా నమోదు చేయాలని, అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని డ్వామా పీడీ సలీం బాషా హెచ్చరించారు. మంగళవారం ఆయన మండలంలోని కడదరకుంట, చోళసముద్రం, జల్లిపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో చేస్తున్న పశువుల నీటి తొట్టెల నిర్మాణాలు, చేపడుతున్న ఫారంపాండ్ల తవ్వకాలను పరిశీలించారు. మండలానికి కేటాయించిన పశువుల నీటి తొట్టెలు నిర్మాణాలు, ఫారంపాండ్ల తవ్వకాలను గడువు లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన కూలీలతో మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీడీ విజయ కుమార్, ఏపీఓ పోలేరయ్య, ఇంజనీర్ రాజేష్, టీఏలు కోమల, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

బొమ్మనహాళ్: ఉద్దేహాళ్‌కు చెందిన దేవరాజు, దేవమ్మ, ఏడేళ్ల చిన్నారి నాగేంద్ర ద్విచక్ర వాహనంపై బళ్లారి వైపు వెళ్తుండగా నేమకల్లు క్రాస్ వద్ద ఇటీవల ప్రైవేట్ బస్సు ఢీకొనింది. ఈ ప్రమాదంలో నాగేంద్ర అనే చిన్నారికి కాలు విరిగింది. దేవమ్మ తీవ్ర గాయాలతో బెంగళూరులో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. బాధితులు ఫిర్యాదు మేరకు బళ్లారి రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతురాలు దేవమ్మకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్


జూదరులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

తాడిపత్రిటౌన్: తాడిపత్రి మండల పరిధిలోని సజ్జలదిన్నె గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న ఎనిమది మందిని అరెస్ట్ చేసామని సీఐ శివగంగాధర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. వారి నుంచి రూ.26,570 నగదు, ఏడు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి


గర్భిణులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శివకృష్ణ

రాప్తాడు: సుఖ ప్రసవం కోసం హైరిస్క్ గర్భిణులు జాగ్రత్తలు తప్పక పాటించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి శివకృష్ణ తెలిపారు. ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో మండలంలోని హైరిస్క్ గర్భిణులకు రక్త పరీక్ష, బీపీ, డయాబెటిస్, హిమోగ్లోబిన్ తదితర వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గర్భిణులకు ఆరోగ్య సూత్రాలను తెలియజేశారు. ప్రసూతి సేవలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. అనంతపురానికి చెందిన పులిపాటి శ్రీకాంత్, పోసిన యోగేంద్ర 75 మంది హైరిస్క్ గర్భిణులు, సిబ్బందికి అన్నదానం ఏర్పాటు చేశారు. సీహెచ్‌ఓ శివప్రసాద్, సూపర్‌వైజర్లు నరసింహ, అరుణ, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీధర్‌బాబు, ఫార్మసి ఆఫీసర్ మూర్తి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు కూటమి ప్రభుత్వం నిలువునా మోసం


ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అనంతపురం రూరల్: ఎన్నికల హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం పేదలను నిలువునా మోసగించిందని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మండిపడ్డారు. పేదల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం వారు ఆర్డీఓకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు కేశవరెడ్డి, మల్లికార్జునగౌడ్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామన్న సీఎం చంద్రబాబు ఒక్క పథకం కూడా అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కుంటుపడిందన్నారు. మహిళలు, చిన్నారులపై అఘాయత్యాలు జరుగుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు కుళ్లాయప్ప, రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

'షైనింగ్ స్టార్స్'లో ప్రభుత్వ విద్యార్థులకు అన్యాయం

అనంతపురం ఎడ్యుకేషన్: టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు అందజేసిన 'షైనింగ్ స్టార్స్' అవార్డుల్లో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేశారని వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ వాపోయారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ యాజమాన్యాల విద్యా సంస్థల్లో చదువుకుని ప్రతిభ చాటారో వారికి మాత్రమే 'జగనన్న ఆణిముత్యాలు' పేరుతో ప్రోత్సాహకాలు అందించిందని గుర్తు చేశారు. ప్రభుత్వ విద్యకు పెద్దపీట వేశారని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రైవేటు విద్యకు పెద్దపీట వేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేయకుండా ప్రైవేటు విద్యార్థులకే ఎక్కువ ప్రోత్సాహకాలు అందజేసిన ఘనత ఈ ప్రభుత్వానికి దక్కుతుందని తెలిపారు. ఎవరైతే ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుకున్న విద్యార్థులను చిన్నచూపు చూస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ప్రైవేటు విద్యను కాకుండా ప్రభుత్వ విద్యను ప్రోత్సహించాలని కోరారు.

కసాపురంలో మన్యుసూక్త హోమం


హోమం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం మన్యుసూక్త హోమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయ యాగశాలలో స్వామివారి ఉత్సవ మూర్తిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ మన్యుసూక్త హోమం నిర్వహించి, తీర్థప్రసాదాలను అందజేశారు.

యువకుడి ఆత్మహత్య

అనంతపురం సిటీ: అనంతపురం–ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ల మధ్య రైలు కింద పడి గుర్తు తెలియని ఓ యువకుడు (25) ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ ఎస్ఐ వెంకటేశ్వర్లు మంగళవారం రాత్రి తెలిపారు. సమాచారం అందిన వెంటనే సిబ్బందితో కలసి ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సర్వజనాస్పత్రి మార్చురీకి తరలించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుంతకల్లు రూరల్: మండలంలోని అయ్యవారుపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు హనుమేష్‌రెడ్డి, జయరాంరెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న యువనాయకుడు మంజునాథ్‌రెడ్డి బుధవారం గ్రామానికి చేరుకొని బాధితులను పరామర్శించారు. ఆయన వెంట సీనియర్ నాయకుడు పాండురంగారెడ్డి తదితరులున్నారు.